క్లుప్తంగా

ఏఎస్పీ ఆకస్మిక తనిఖీలు

కొండమల్లేపల్లి: స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా గురువారం రాత్రి కొండమల్లేపల్లి పట్టణంలో ఏఎస్పీ మౌనిక ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్, లాడ్జీలు, హోటళ్లు, సినిమా థియేటర్లలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అపరిచిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి ఉంచాలని పోలీసులకు సూచించారు. ఈ తనిఖీల్లో సీఐ నవీన్‌కుమార్, ఎస్‌ఐ అజ్మీరా రమేష్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు ఎవరూ వెళ్లొద్దు

అడవిదేవులపల్లి : కృష్ణానదికి సుమారు 3లక్షల క్యూసెక్కుల నీటి వరద వస్తున్నందున ఎవరూ కృష్ణానదిలోకి చేపల వేటకు వెళ్లొద్దని ఎస్‌ఐ శేఖర్ తెలిపారు. వేటకు వెళ్లినట్లయితే ఆ వరదల్లో కొట్టుకుపోవడం, మునిగిపోవడం వంటి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. అదే విధంగా కృష్ణ పరివాహక ప్రాంతాల ప్రజలు కూడా ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు.

నేడు సాయి సన్నిధిలో లక్ష గాజుల పూజ

చింతపల్లి : మండల కేంద్రంలోని శ్రీ సాయి సన్నిధి సాయిబాబా దేవాలయంలో శ్రావణ మాసంలో భాగంగా కనుల పండువగా శుక్రవారం లక్ష గాజుల పూజను నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు ఆలయ కమిటీ చైర్మన్ మంచికింటి ధనుంజయ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దేవాలయంలో ఉదయం 10 గంటలకు శ్రీ సౌభాగ్యలక్ష్మి పూజా, మహోత్సవ సమాహ్వనం, సుహాసిని పూజ, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలను శ్రీ రేణుకా రాజరాజేశ్వరి పీఠం (మెళ్లూరి నవీనశర్మ) ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ప్రధాన మంత్రి జనారోగ్య యోజనపై అవగాహన

నాగార్జునసాగర్ : ప్రధానమంత్రి జనారోగ్య యోజనపై ప్రజలకు స్థానిక బీసీగురుకుల పాఠశాల ఎన్‌సీసీ కేడెట్స్ ఫ్లకార్డ్స్ పట్టుకొని నినాదాలు చేస్తూ గురువారం అవగాహన ర్యాలీ చేపట్టారు. పేద ప్రజలకు ఆరోగ్యంపై ప్రభుత్వం రూ5లక్షల వరకు క్యాష్‌లెస్ వైద్యం అందిస్తుందని తెలిపారు. ప్రమాదాలు, అనారోగ్యానికి గురైనపుడు ప్రజలు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ప్రజలను చైతన్య పరిచారు. విద్యార్థులతో పాటు ఎన్‌సీసీ సీటీఓ గణేష్ మల్లికార్జున్‌రావులు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

మాడుగులపల్లి: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా గురువారం మండల కేంద్రంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి కేంద్ర ఎన్నికల కమిషన్ సహకారంతో కుట్రలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లెంల శ్రీకర్, నాయకులు బొంగర్ల వెంకటయ్య, నాగయ్య, నర్సిరెడ్డి, యాదయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తూ గేదెను ఢీకొని వ్యక్తి మృతి

గుర్రంపోడు: బైక్‌పై వెళ్తున్న వ్యక్తి గేదెను ఢీకొని మృతిచెందాడు. ఈ ఘటన గుర్రంపోడు మండలం తుర్కపల్లి గ్రామ స్టేజీ సమీపంలో గురువారం సాయంత్రం జరిగింది. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. అనుముల మండలం మారేపల్లి గ్రామానికి చెందిన గణపతి వెంకన్న(42) గురువారం బైక్‌పై మక్కపల్లి గ్రామంలో జరిగిన బొడ్రాయి పండుగకు వెళ్లి తిరిగి వస్తుండగా.. తుర్కపల్లి గ్రామ స్టేజీ సమీపంలో ఎదురుగా వస్తున్న గేదెను ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన వెంకన్న అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ తెలిపారు.

టాటా ఏస్ వాహనంలో మంటలు

దేవరకొండ : ప్రమాదవశాత్తు టాటా ఏస్ వాహనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగిన ఘటన దేవరకొండ పట్టణంలోని సుభాష్ రోడ్డులో గురువారం చోటుచేసుకుంది. దీంతో స్థానికులు ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. వివరాలు ఇలా.. దేవరకొండ పట్టణంలోని సుభాష్‌రోడ్డులో టాటాఏస్ వాహన డ్రైవర్ టీ తాగేందుకు వాహనాన్ని ఆపాడు. ఈ క్రమంలో ఒక్కసారిగా వాహనంలోని ఇంజన్ నుండి మంటలు చెలరేగాయి. ఇది గమనించిన స్థానికులు మంటలు ఆర్పేందుకు ప్రయత్నించారు. మంటలు అదుపులోకి రాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఫైర్ అధికారులు ఆంజనేయులు, నాగుల్ మీరా, రవి, పరబ్రహ్మం, వెంకటేశ్వర్లు, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

పొంగిన వాగులు.. నిండిన చెరువులు



పెద్దవూర : కత్వపై నుంచి పారుతున్న పెద్దవాగు



తిరుమలగిరి(నాగార్జున సాగర్) : చెరువును తలపిస్తున్న వరి పొలాలు

- సాగర్, మిర్యాలగూడ నియోజకవర్గాల్లో భారీ వర్షం
- అలుగుపోస్తున్న చెరువులు
- కాజ్‌వేలపై నుంచి వరద ప్రవాహం

మిర్యాలగూడ టౌన్, మిర్యాలగూడ అర్బన్ : రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పట్టణంలోని కాలనిలన్నీ జలమయంగా మారాయి. పట్టణంలోని మయూరి నగర్, రంగన్న కాలనీ, మందులవారి కాలనీ, సుందర్‌నగర్, గాంధీనగర్, షాబునగర్, తదితర ప్రాంతాల్లో పలు గృహాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఆయా కాలనీలలోని ప్రజలు, ఉద్యోగులు, విద్యార్థులు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. మయూరి నగర్‌లో వర్షపునీటికి చేపలు రావడంతో ఆ ప్రాంత వాసులు వలలు పట్టి చేపలు పట్టుకున్నారు. పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జ్‌లతోచార్జీలతో కలిసి పర్యటించారు. మండలంలోని రాయిపాలెం గ్రామానికి చెందిన కున్‌రెడ్డి రవీందర్‌రెడ్డి ఇంటి గోడ కూలింది. ఇంట్లో వారు అప్రమత్తం కావడంతో ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ఈ సంఘటన స్థలాన్ని ఆర్ఐ కృష్ణయ్య, గ్రామ కార్యదర్శి ఎన్. రమణమ్మలు పరిశీలించారు. అలాగే మిర్యాలగూడ మండలంలోని చిల్లాపురంరోడ్డు లో అజ్మీరాతండా వద్ద వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తుంది. దీంతో వాహనాదారులకు ఇబ్బందులు పడుతున్నారు.

మాడుగులపల్లి : భారీ వర్షాల కారణంగా మండలంలోని పలు చెరువులు, కుంటల్లో భారీగా నీరు చేరడంతోపాటు ఆగామోత్కూర్, బొమ్మకల్ చెక్‌డ్యాంలు నిండుకుండలా మారి వరదనీటితో పొంగిపొర్లి అలుగుపోస్తున్నాయి. మండలంలోని పూసలపాడు వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో రోడ్లు దెబ్బతినగా పూసలపాడు నుంచి కంపాలపల్లి, కామారెడ్డిగూడెంకు చెందిన సుమారు 60మంది కార్మికులు కుక్కడంలో ఉన్న కంపెనీలకు వెళ్లాలంటే



మిర్యాలగూడ టౌన్ : రంగన్న కాలనీలో జలమయంగా మారిన రోడ్డు

ఇబ్బందులు ఎదుర్కొన్నారు. చేసేదేమి లేక సుమారు 30కిలోమీటర్ల దూరం చుట్టు తిరిగి తమ గమ్య స్థానాలకు చేరుకుంటున్నారు.

అలుగుపోస్తున్న పేరూర్ చెరువు

హాలియా : గత రెండు, మూడు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు అనుముల మండలంలోని పలు చెరువులు జలకళ సంతరించుకున్నాయి. ఎగువ నుంచి వచ్చిన వరదతో గురువారం హాలియా వాగు ప్రవహిస్తోంది. మండలంలోని పేరూర్ చెరువులోకి వరద వచ్చి చేరడంతో చెరువు అలుగుపోస్తుంది. దీంతో ఒక పక్క జాలరులు వలలతో చేపలు పడుతుండగా మరో పక్క ఉధృతంగా ప్రవహిసస్తున్న పేరూర్ చెరువుతో పేరూర్-హాలియా రహదారిపై రాకపోకలు నిలిచాయి.

పెద్దవూర: వర్షాలకు మండలంలోని వాగులు, చెరువులు, కుంటలు నిండి పొంగి పొర్లుతున్నాయి. మండలం నుంచి ప్రవహించే పెద్దవాగు పొంగి పొర్లుతుంది. మండలంలోని పెద్దవూర, పోతునూరు, సంగారం, నాయినివానికుంట, చింతపల్లి, శిర్సనగండ్ల, వెల్మగూడెం తదితర గ్రామాల్లోని చెరువులు నిండి అలుగులు పోస్తున్నాయి. మండలంలోని పర్వేదుల-పెద్దవూర రహదారిపై, పోతునూరు-పులిచర్ల రహదారులపై ఉన్న కల్వర్టుపై నుంచి వరద నీ రు పొంగి పొర్లుతుంది. మండల కేంద్రం సమీపంలో కత్వాపై నుంచి పెద్దవాగు జలాలు ఎత్తిపోస్తుండటంతో పరిసర గ్రామాల ప్రజలు ఆసక్తిగా తిలకించి అందాలను తమ సెల్‌ఫోన్‌లలో బంధించుకున్నారు.



మిర్యాలగూడ టౌన్: కూలిన ఇంటి గోడను పరిశీలిస్తున్న అధికారులు

తిరుమలగిరి(నాగార్జునసాగర్): భారీ వర్షానికి జనం అతలాకుతలం అవుతున్నారు. మండలవ్యాప్తంగా బుధవారం రాత్రి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రోడ్లు జలమయం అయ్యాయి. మండలంలో వరి నాట్లు ముమ్మరంగా కొనసాగుతుండటంతో వరి పంట కూడా పూర్తిగా నీట మునిగింది.

అధికారుల పర్యవేక్షణ

నిడమనూరు : వర్షాలతో నిడమనూరు చెరువు ప్రమాదస్థాయిలో అలుగు పోస్తుండటంతో నీటిపారుదుల, మండల పరిషత్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వరద ప్రవాహాన్ని డీఈ శ్రీనివాసరావు, ఏఈ జగన్ గురువారం పరిశీలించారు. ఎంపీడీవో గంజి వెంకటేషం, కార్యదర్శి నరసింహాచారి నిడమనూరు-బంకాపురం రోడ్డులో లో లెవల్ కల్వర్టు వద్ద వరద ప్రవాహన్ని పరిశీలించారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

చందంపేట : భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీధర్‌బాబు, ఎస్‌ఐ లోకేష్‌లు ప్రజలకు సూచించారు. గురువారం చందంపేట మండల సమీపంలోని మన్నెవారిపల్లి పరిసర ప్రాంతాల్లో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నందున పరిసర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వాగు దాటే ప్రయత్నం చేయొద్దన్నారు.



పెద్దవూర: పులిచర్ల ప్రాథమిక పాఠశాలలో వర్షం నీటిలోంచి వెళ్తున్న విద్యార్థులు



నిడమనూరు : బంకాపురంలో లెవెల్ కల్వర్టును పరిశీలిస్తున్న ఎంపీడీఓ



మిర్యాలగూడ టౌన్ : మయూరి నగర్‌లో..



హాలియా : అలుగుపోస్తున్న పేరూర్ చెరువు



మాడుగులపల్లి : పొంగిపొర్లుతున్న బొమ్మకల్ చెక్‌డ్యాం



పెద్దవూర-పర్వేదుల రోడ్డు వంతెనపై నుంచి వెళ్తున్న చిన్నవాగు

విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ : భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు.గురువారం దేవరకొండ పట్టణంలో విద్యుత్‌శాఖ డైరెక్టర్ శివాజీతో కలిసి ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో ఆయన మా ట్లాడారు. ప్రస్తుతం కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలన్నారు. చెట్లు విరిగిపడడం, పిడుగులు పడడం వంటి పరిస్థితుల్లో విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బంది ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం అత్యవసర మరమ్మతుల కోసం ప్రత్యేక రెస్క్యూ టీంలను ఏర్పాటు చేసి అవసరమైన పరికరాలు, టూల్ కిట్లను సిద్ధంగా ఉంచాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు వచ్చినా సంబంధిత అధికారులు తగిన జాగ్రత్తలు పాటిస్తూ తక్షణమే స్పందించాలన్నారు. ఈ సమావేశంలో సీజీఎం భిక్షపతి, ఆర్డీఓ రమణారెడ్డి, డీటీ కష్టారావు, డీఈ విద్యాసాగర్, ఏడి సైదులు, సాగర్‌రెడ్డి, తదితరులున్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్

అఖిలేష్ యాదవ్ మృతి తీరని లోటు

పట్టణానికి చెందిన బీజేపీ సీనియర్ నాయకుడు నక్క వెంకటేష్‌యాదవ్ చిన్నకుమారుడు డాక్టర్ అఖిలేష్‌యాదవ్ అకాల మృతి తీరని లోటని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్, ఎమ్మెల్సీ అంజిరెడ్డి అన్నారు. గురువారం దేవరకొండలో అఖిలేష్ యాదవ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో వారు వేర్వేరుగా పాల్గొన్నారు. అఖిలేష్‌యాదవ్ పేరుతో ఫౌండేషన్ ఏర్పాటు చేసి తల్లిదండ్రులు నక్క వెంకటేష్, సత్తెమ్మలు సేవలు అందించడం అభినందనీయమన్నారు. అనంతరం మహిళలకు ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ చీరలు పంపిణీ చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచారి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, ఆలంపల్లి నర్సింహ, నల్ల గాసు జాన్‌యాదవ్, పున్న వెంకటేష్, ముక్కమళ్ల వెంకటయ్య, ఏడుకొండల్, శ్రీనివాస్‌యాదవ్, వెంకటేష్, తదితరులున్నారు.

ఇరు వర్గాల మధ్య ఘర్షణ

- ఒకరికి గాయాలు
- స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు

డిండి: మండల పరిధిలోని సింగరాజుపల్లి గ్రామంలో ఇరు వర్గాల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం సింగరాజుపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం సాయంత్రం మండల సింగరాజుపల్లి గ్రామానికి చెందిన పానుగోటి రవీందర్‌రావు వ్యవసాయ పొలంలో పనులు చేస్తున్నాడు. ఇదే సమయంలో అటువైపు నుంచి వస్తున్న అదే గ్రామానికి చెందిన గోరంట్ల కోటయ్య, రవీందర్‌రావును కలిసి మాట్లాడుతున్న క్రమంలో మాటా మాటా పెరిగి ఘర్షణకు దిగి ఒకరిపై మరొకరు దాడి చేసుకున్నారు. గమనించిన శ్రీపతి బొడ్డయ్య, సురేందర్‌రావు, గోరంట్ల ప్రశాంత్ గొడవను సర్దుమనిగేలా చేస్తున్నారు. ఈ క్రమంలో బొడ్డయ్యకు గాయాలయ్యాయి. దీంతో ఇరు వర్గాలకు సంబంధించిన వ్యక్తులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఒకరిపై మరొకరు ఫిర్యాదు చేసుకున్నారు. గురువారం స్థానిక ఎస్ఐ. బాలకృష్ణ తన సిబ్బందితో కలిసి సింగరాజుపల్లిలో విచారణ చేపట్టినట్లు సమాచారం. ఈ ఘర్షణకు పాత కక్ష్యలే కారణమని పలువురు స్థానికులు పేర్కొంటున్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

హాలియా: వ్యవసాయ పొలం వద్ద విద్యుత్ మోటారు ఆన్ చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై రైతు మృతి చెందాడు. ఈ ఘటన అనుముల మండలం కొత్తపల్లి గ్రామంలో గురువారం ఉదయం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుమలగిరి(సాగర్) మండలంలోని శ్రీరాంపల్లి గ్రామానికి చెందిన కూరాకుల లక్ష్మయ్య(45) తన భార్యాపిల్లలతో కలిసి బతుకుదెరువు నిమిత్తం అనుముల మండలం కొత్తపల్లి గ్రామానికి వలస వచ్చాడు. గత 20 ఏళ్లుగా ఇక్కడే నివాసముంటూ తనకున్న ఎకరంన్నర భూమిలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం ఉదయం లక్ష్మయ్య తన పొలం వద్దకు వెళ్లి విద్యుత్ మోటర్ ఆన్ చేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో హెడ్ కానిస్టేబుల్ యాదయ్య ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నాగార్జునసాగర్‌లోని కమలానెహ్రూ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సువర్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ యాదయ్య తెలిపారు.

ఆర్గాన్ డొనేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా విజయభాస్కర్‌రావు



మిర్యాలగూడ టౌన్ : వాసవి క్లబ్ ఆఫ్ ఆర్గాన్ డొనేషన్ ఇంటర్నేషనల్ చైర్మన్‌గా పట్టణానికి చెందిన మిట్టపల్లి విజయ భాస్కర్‌రావును నియమిస్తూ ఆ క్లబ్ ప్రెసిడెంట్ ఇరుకుల్ల రామకృష్ణ గురువారం ఉత్తర్వులను జారీ చేశారు.. ఈ సందర్భంగా విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ ఐదేళ్లుగా వాసవి క్లబ్ ద్వారా అనేక సేవలు చేశానని, తను చేసిన సేవలను గుర్తించిన క్లబ్ తనపై మరింత బాధ్యతను పెట్టిందన్నారు. చైర్మన్‌గా ఎన్నికైన విజయభాస్కర్‌రావును డిస్ట్రిక్ట్ ఇన్‌చార్జ్ శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. తన నియామకానికి అన్ని విధాలుగా సహకరించి క్లబ్‌సభ్యులందరికీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.

దాతల సహకారం అభినందనీయం

గుర్రంపోడు : పేద విద్యార్థులు చదివే ప్రభుత్వ పాఠశాలలకు దాతల సాయం అభినందనీయమని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు, హెచ్ఎం కాలం నారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని నడికూడ గ్రామ ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన ఒంటెద్దు సంజీవరెడ్డి తన తల్లి యాదయ్మ జ్ఞాపకార్థం రూ.20వేల విలువైన మైక్‌సెట్‌ను బహూకరించారు. ఈ కార్యక్రమంలో టీచర్లు దూదిపాల వెంకట్‌రెడ్డి, బొల్లు వెంకట్‌రెడ్డి, జి. సైదమ్మ, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



నూతనంగా ఎన్నికైన మెడికల్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

మిర్యాలగూడ అర్బన్ : మిర్యాలగూడ మెడికల్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక బుధవారం నిర్వహించారు. అసోషియేషన్‌లో మెత్తం 309మంది ఓటర్లు ఉండగా 300 ఓట్లు పోలయ్యాయి. అధ్యక్షుడిగా కొంపల్లి గోవర్ధన్, ఉపాధ్యక్షుడిగా చిదురాల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా కర్నాటి శ్రీధర్, కోశాధికారిగా నల్లమెట్ల నరేశ్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎండీ రషీద్‌లు ఎన్నికయ్యారు. పాత కార్యవర్గ ప్యానల్ అభ్యర్థులు గెలవడంతో సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

డ్రగ్స్ రహిత సమాజానికి పాటుపడుదాం

నాగార్జునసాగర్ : మాదక ద్రవ్యాల రహిత సమాజం కోసం ప్రతి విద్యార్థి పాటుపడాలని మహాత్మా జ్యోతిబాపూలే నాగార్జునసాగర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మాధవిలత అన్నారు. గురువారం కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కళాశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం ఆఫీసర్ లలిత మేడం, శివ, జానయ్య, మహేదంర్, యాదగిరి, నవ్యసత్య నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

2,33,519 క్యూసెక్కుల నీరు విడుదల

అడవిదేవులపల్లి: అడవిదేవులపల్లి గ్రామ సమీపంలోని టెయిల్‌పాండ్ నుంచి గురువారం 13 గేట్ల ద్వారా 2,33,519 క్యూసెక్కుల నీటిని దిగువన పులిచింతల ప్రాజెక్టుకు అధికారులు విడుదల చేశారు. సాగర్ జలాశయం నుంచి 2,34,216 క్యూసెక్కుల నీరు టెయిల్‌పాండ్‌కు వచ్చి చేరుతోంది.

మిర్యాలగూడలో తిరంగా ర్యాలీ



మిర్యాలగూడ టౌన్: తిరంగా ర్యాలీలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మిర్యాలగూడ టౌన్: దేశ అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని కోరుతూ దేశ ప్రధాని నరేంద్ర మోడీ పిలుపు మేరకు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ అద్దంకి-నార్కట్‌పల్లి బైపాస్ ప్లేవెర్ బ్రిడ్జి నుంచి రాజీవ్ చౌక్ వరకు ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు, నాయకులు బంటు సైదులు, పురుషోత్తంరెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, సజ్జల నాగిరెడ్డి, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కొండేటి సరిత, చిల్లంచర్ల అభి, ఎడ్ల రమేష్, వెంకటరమణ, బంటు గిరి, కంచుకొమ్ముల వేణు, పెద్దమాం భరత్, జంగిలి రవి, మేష్యానాయక్, సీతారాంరెడ్డి పాల్గొన్నారు.

ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం ఎగరాలి

చింతపల్లి : ప్రతి ఒక్కరి మదిలో దేశభక్తిని చాటిచెప్పేలా ప్రతి ఇంటిపై త్రివర్ణ పతాకం రెపరెపలాడాలని బీజేపీ మండల అధ్యక్షుడు సముద్రాల నగేష్ పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ జెండాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కుకుడపు రామకృష్ణ, గొడుగు శ్రీను, వెంకటయ్య, అభినవ్ తదితరులు పాల్గొన్నారు.

సీడీపీఓకు వినతి

మిర్యాలగూడ టౌన్ : అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మిర్యాలగూడ అర్బన్ సీడీపీఓ మమతకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి మల్లు గౌతంరెడ్డి, తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ జిల్లా కార్యదిర్శ బొంద పార్వతి మాట్లాడారు. ఈనెల 18న కలెక్టరేట్ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఈ వినతిపత్రం అందజేసిన వారిలో అంగన్‌వాడీ టీచర్లు ఇంద్రపల్లి సైదమ్మ, ఎం, ప్రమీల, అరుణ, ఉమారాణి, గాయం ప్రమీల, రాధాబాయి, స్వరాజ్యం, విజయ తదితరులు పాల్గొన్నారు.


క్రీడాదుస్తుల పంపిణీ

నిడమనూరు : స్థానిక జెడ్పీఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రీడా దుస్తులను ప్రధానోపాధ్యాయుడు గౌతమ్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా విద్య, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో అధికసంఖ్యలో రాణిస్తుంటారని, క్రీడా దుస్తుల పంపిణీతో విద్యార్థులను ప్రొత్సాహించనట్లవుతుందన్నారు. పాఠశాలలోని 150 మంది విద్యార్థులకు హెచ్ఎం గౌతమ్ తన సొంత డబ్బుల రూ.60వేల తో క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్లు తెలిపారు విద్యార్థులు గతంలో కబడ్డీలో రాణించడం ద్వారా వ్యాయామ ఉపాధ్యాయులుగా, పోలీస్, ఇంజనీరింగ్, వైద్య ఉన్నత విద్యలో సులభంగా ప్రవేశాలు పొందవచ్చని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామ్మోహన్, కమార్జాహాన్, జలేందర్, వెంకన్న, రమాదేవి, విజయలక్ష్మి, అశాసిద్ధికి, జ్యోతి, మాధవి, పీడీ లచ్చయ్య, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రజల ఇబ్బందులను తొలగించాలి

మిర్యాలగూడ అర్బన్ : ప్రతి రోజు కురుస్తున్న వర్షాలకు రోడ్లు కాలువలను తలపిస్తున్నాయని వర్షపు నీటిని తొలగించి ప్రజల ఇబ్బందులను తొలగించాలని సీపీఎం మండల కార్యదర్శి రవినాయక్ కోరారు. గురువారం మండలంలోని ఐలాపురం, కుంటకింది తండా, పెద్దదేవులపల్లి, చిల్లాపురం వెళ్లే దారిలో రైల్వే అండర్‌పాస్ కింద వర్షపునీరు చేరడంతో వాటిని తొలగించాలని కోరుతూ నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు పిల్లుట్ల సైదులు, పోలేపల్లి గోవిందరెడ్డి, నాగేశ్వర్ రావు, ఆశీర్వాదం, శ్రీనునాయక్, బాలాజి, రఘు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు



హాలియా : టైం స్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు



కొండమల్లేపల్లి : ఉట్టి కొడుతున్న చిన్నారులు

మిర్యాలగూడ : పట్టణంలోని ఆదిత్య పాఠశాలలో గురువారం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారుతి అమరేందర్‌రెడ్డి మాట్లాడుతూ పలువురు విద్యార్థులు శ్రీకృష్ణుడి వేషధారణలో అలరించారన్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో పూజా కార్యక్రమం నిర్వహించి విద్యార్థులతో ఉట్టి కొట్టించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ మన్నెం సైదిరెడ్డి, ప్రిన్సిపాల్ బంటు నాగరాజు, వైస్ ప్రిన్సిపాల్ కట్టా అనిత, పాల్గొన్నారు.

హాలియా : స్థానిక టైం స్కూల్‌లో గురువారం కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మన సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణలో భాగంగా చిన్నారులు శ్రీ కృష్ణుడు, గోపికల వేషధారణలో కనువిందు చేశారు. శ్రీ కృష్ణుడి జీవిత చరిత్ర, గోపికా లీలలు, మకరంద నాటకాలు, భక్తి గీతాలతో అలరించారు. చిన్ని కృష్ణులు ఉట్టి కొట్టారు. అనంతరం డైరెక్టర్స్ మందా నరేందర్‌రెడ్డి, కోటిరెడ్డి బహుమతులను అందజేశారు.

కొండమల్లేపల్లి : స్థానిక రెయిన్‌బో ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో గురువారం ముందస్తుగా కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధిక వేషాధారణలతో అలరించి ఉట్లు కొట్టారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ ఎం.ఆనంద్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఫర్హీన్ సుల్తానా, బాలయ్య, యశ్వంత్, సుష్మ, శ్రీలత, శైలజ, నాగమణి, కళ్యాణి, విజయలక్ష్మీ, పాల్గొన్నారు.

కోల్‌ముంతలపహాడ్‌లో తీజ్ వేడుకలు



మొలక బుట్టలు ఎత్తుకొని ఊరేగింపుగా వెళ్తున్న గిరిజన మహిళలు

కొండమల్లేపల్లి : మండల పరిధిలోని కోల్‌ముంతలపహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని మంత్య తండాలో గురువారం తండావాసులు తీజ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మొలకల బుట్టలతో ఊరేగింపుగా శోభాయాత్ర నిర్వహించి గిరిజన సంప్రదాయ నృత్యాలతో నిమజ్జనానికి తరలించారు. ఈ కార్యక్రమంలో రమావత్ దస్రూనాయక్, మాడ్గుల యాదగిరి, రమావత్ భాస్కర్‌నాయక్ తండాసులు పాల్గొన్నారు.



తీజ్ వేడుకల్లో పాల్గొన్న గిరిజన యువత